కంకరపై ప్రయాణం.. నరకప్రాయం

- నత్తనడకన రోడ్డు నిర్మాణ పనులు
- దుమ్ముతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



పీచర(వేములపల్లి)నుంచి కన్నారం వెళ్లే దారిలో కంకర పోసి వదిలేసిన రోడ్డు



లోక్యతండా నుంచి పీచర సమ్మక్క వరకు పోసిన కంకర

వేలేరు : ఏళ్ల తరబడి నుంచి వేధిస్తున్న రోడ్డు సమస్య నేటితో తొలగిపోతుందని గ్రామస్తుల సంబురం మూన్నాళ్ల ముచ్చగానే మిగిలింది. సదరు కాంట్రాక్టర్ బిల్లులు రావడం లేదనే నెపంతో రోడ్డు నిర్మాణ పనులను మధ్యలోనే ఆపుదల చేసి చేతులు ఎత్తేశాడు. దీంతో వాహనదారులు, ఆ గ్రామాల ప్రజలకు కంకరపై నడక నరకాప్రాయంగా మారుతోంది. మండలంలోని కన్నారం గ్రామం నుంచి వేలేరు మండలానికి రావడానికి సరైన రోడ్డు సౌకర్యం, బస్సు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కన్నారం గ్రామం గతంలో కరీంనగర్ జిల్లా భీమదేవరపల్లి మండలంలో ఉండేది. జిల్లాలు, మండలాల పునర్విభజనలో కొత్తగా ఏర్పడిన వేలేరు మండలంలో కన్నారం గ్రామాన్ని కలిపారు. అప్పటి నుంచి మండల కేంద్రానికి రావాలంటే గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతూ గుంతల రోడ్డుపై ప్రయాణం కొనసాగించేవారు. అయితే కన్నారం గ్రామం హుస్నాబాద్ నియోజకవర్గం పరిధిలో ఉంటే మండలమేమో వేలేరు కావడంతో అభివృద్ధికి నోచుకోవడం లేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కొన్ని నెలల కిత్రం అప్పటి ప్రభుత్వం రూ.4 కోట్ల 35 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించింది. కాగా సంబంధిత గుత్తేదారు రోడ్డుపై కంకరపోసి బిల్లులు రావడం లేదని పనులను మధ్యలోనే వదిలేయడంతో గ్రామం నుంచి మండలానికి, వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు రవాణా కష్టాలు తప్పడం లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఐటీడీఏ నిధుల నుంచి గ్రామాలకు లింక్ రోడ్ల నిర్మాణం కోసం రూ.12కోట్లు కేటాయించారు. పీచర వయా జంగం కుంట నుంచి లోక్యతండా వరకు, లోక్యతండా నుంచి మిరుపకుంట వయా పీచరసమ్మక్క, లోక్యతండా పంచాయతీ పరిధిలోని వేపలగడ్డతండ నుంచి వేలేరు అంబేడ్కర్ సెంటర్ వరకు, అలాగే మాటుతండ నుంచి ఎర్రబెల్లి వరుకు, లక్ష్మీతండ నుంచి కస్తూర్బా గాంధీ పాఠశాల వరకు, వేలేరు తహసీల్దార్ కార్యాలయం నుంచి బంగ్లాపల్లి వరకు రూ.12కోట్లతో పనులు మొదలు పెట్టిన సంబంధిత గుత్తేదార్లు.. కంకర పోసి వదిలేశారు. దీంతో వాహనదారులకు ప్రయాణం నరకప్రాయంగా మారుతోంది. కంకర తేలి ఉండడంతో వాహనదారులు పలుమార్లు ప్రమాదాలకు గురై తీవ్రంగా గాయపడ్డారు. రోడ్డుపై వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని వివిధ గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గుత్తేదారుల ఇష్టారాజ్యం..

రోడ్డు నిర్మాణ పనులు చేపట్టిన గుత్తేదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రోడ్డు మొత్తం ఒకేసారి కంకర పోసి నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆ రోడ్డు వెంట వెళ్లే రైతులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయినప్పటికీ సంబంధిత గుత్తేదారులపై అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలకు తావిస్తోంది. ఇటీవల స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సంబంధిత శాఖ అధికారులతో రివ్యూ చేసి రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అయినా అధికారులు మాత్ర వినివిననట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవచూపి రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పనులు పూర్తి చేయాలి



లోక్యతండా గ్రామపంచాయతీ పరిధిలో ఐటీడీఏ నిధులతో చేపడుతున్న బీటీ రోడ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి. రోడ్లపై కంకర పోసి నెలలు గడుస్తున్నా బీటీ వేయడంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడు. కంకర వేసిన రోడ్డుపై బైక్‌లు స్కిడ్ అయ్యి పడటంతో గాయాలు అవుతున్నాయి. అధికారులు, పాలకులు ఇప్పటికైనా చొరవ తీసుకుని రోడ్డు నిర్మాణ పనులను త్వరాగా పూర్తి చేయాలి.

-మురావత్ లింగయ్య, లోక్యతండ గ్రామస్తుడు

క్లుప్తంగా

కడియం కావ్య ప్రార్థనలు



ధర్మసాగర్ : మండలంలోని కరుణాపురం క్రీస్తుజ్యోతి ప్రార్థన మందిరంలో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కాంగ్రెస్ పార్టీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్య శనివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో కడియం కావ్య విజయం సాధించాలని రెవరెండ్ డాక్టర్ సంగాల పాల్సన్‌రాజ్, డాక్టర్ గోపు జయప్రకాశ్‌రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేసి ఆశీర్వచనాలు అందచేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జేసీబీ, రెండు టిప్పర్లు పట్టివేత

దామెర : మండలంలోని కోగిల్వాయి శివారులోని చంద్రగిరి గుట్టల వద్ద అనుమతులు లేకుండా శనివారం రాత్రి మొరం తరలిస్తున్న జేసీబీ, రెండు టిప్పర్లను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎర్రబెల్లి పరామర్శ

ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లి గ్రామానికి చెందిన కాటబోయిన కొమురయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శనివారం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నందనం సొసైటీ ఉపాధ్యక్షుడు చందర్‌రావు, నాయకులు ఏలియా, స్వామి, రాములు, కుమారస్వామి ఉన్నారు.

మండల సభ వాయిదా

కమలాపూర్ : మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ రాణి అధ్యక్షతన జరగాల్సిన సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. సమావేశానికి వివిధ శాఖల అధికారులు హాజరైనప్పటికీ ఎంపీపీతో సహా మండల పరిధిలోని వివిధ గ్రామాల ఎంపీటీసీ సభ్యులు ఎవరూ హాజరు కాలేదు. దీంతో కోరం లేని కారణంగా సభ వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ గుండె బాబు ప్రకటించారు.

ఓటర్ స్లిప్పుల పంపిణీ



శాయంపేట : వచ్చే నెల 13వ తేదీన జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీఎల్ఓలు ఇంటింటికెళ్లి ఓటర్ స్లిప్పులను శనివారం పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని పోలింగ్ స్టేషన్ 305 పరిధిలోని ఓటర్లకు బీఎల్ఓ రత్నామాల అందించారు. ఎన్నికల రోజున ఓటర్ స్లిప్‌తో పాటు ఆధార్‌కార్డు, ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా గుర్తింపు కార్డు తీసుకొని పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు.

యువకుడి మృతి



రాజు(ఫైల్)

రేగొండ: కుటుంబ కలహాలతో వ్యక్తి మృతి చెందిన సంఘటన రేగొండ మండలంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా దామెర మండలం పులుకుర్తి గ్రామానికి చెందిన ఈదునూరి రాజు(33) 12 సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నాడు. కాగా భార్యతో ఐదు సంవత్సరాలుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మద్యానికి బానిసైన రాజు మద్యం మత్తులో అతడి అమ్మమ్మ గ్రామమైన కొత్తపల్లిగోరి మండలంలోని దామరంచపల్లికి శుక్రవారం వచ్చాడు. మద్యం మత్తులో ఉన్న రాజును మేనమామ సోమేల్ మందలించగా శనివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో చెన్నాపూర్ శివారులోని పెట్రోల్ బంక్ ముందు మద్యం మత్తులో అక్కడే పడుకొని చనిపోయాడు. మృతుడి తండ్రి ఈదునూరి బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సెకండ్ ఎస్సై శ్రీలత తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిక

సంగెం : మండలంలోని ఎల్గూర్ రంగంపేటకు చెందిన పలువురు బీజేపీ, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో అధికార ప్రతినిధి జనగాం రమేశ్ గౌడ్ ఆధ్వర్యంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సమక్షంలో శనివారం చేరారు. బోనాల అనిల్, బెజ్జంకి సదానందం, బోనాల సదానందం, రమేశ్, రవి, సతీశ్, ఉప్పలయ్య, పవన్, ప్రశాంత్, సమ్మయ్య, నర్సయ్య, రాజబోయిన సాంబయ్య, కడమంచి చంద్రమౌళి, సారంగం, ఇమ్మడి సంపత్, బరిగెల యాకూబ్, బుజ్జక్క తదితరులు చేరగా వారికి ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి కండువా కప్పి అహ్వానించారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి, మాజీ సర్పంచ్‌లు పోతుల ప్రభాకర్, పెద్దగోని లక్ష్మీనారాయణ, ఇమ్మడి ఏసోబు, బోనాల శ్రీనివాస్, బోగి రవి తదితరులు పాల్గొన్నారు.

క్వారీలు, క్రషర్లను తక్షణమే మూసేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

శాయంపేట : మండలంలోని తహరాపూర్, పెద్దకోడెపాక, గోవిందాపూర్, ప్రగతిసింగారం, నేరేడుపల్లి గ్రామ శివారుల్లోని అభిరామ్, శ్రీలక్ష్మిశివసాయి, శ్రీమతి ఆరూరి కవిత, శ్రీసాయిదత్త, శ్రీవేంకటేశ్వర, శ్రీబాలాజీ రోబో సాండ్, శ్రీసాయిరాం, శ్రీ వి ప్రభాకర్‌రెడ్డి, శ్రీవేంకటేశ్వర స్టోన్ క్రషర్, క్వారీలను, డాబక్ ప్లాంట్‌ను తక్షణమే మూసివేయాలని పరకాల ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ చక్రపాణి, మాజీ ఎంపీటీసీ భాస్కర్, మాజీ సర్పంచ్ ప్రకాశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం హనుమకొండ జిల్లా కలెక్టర్, మైనింగ్ ఏడీ, పరకాల ఆర్డీఓ, ఏసీపీ, శాయంపేట తహసీల్దార్, ఎస్సైకు వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు అందించారు. అనంతరం మాట్లాడుతూ.. గ్రామ శివారులోని గుట్టలను రాజకీయ నేపథ్యం కలిగిన ప్రైవేట్ వ్యాపారులు లీజుకు తీసుకొని స్టోన్ క్వారీలు, క్రషర్లు, డాంబర్ ప్లాంట్లు నడుపుతున్నారని ఆరోపించారు. సుప్రీంకోర్టు నిబంధనలకు విరుద్ధంగా పగలు, రాత్రి భారీ బోర్ బ్లాస్టింగ్లు చేస్తున్నారని, సమీప గ్రామాల్లోని ఇళ్లు బీటలు బారుతున్నాయని అన్నారు. వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణులు, గుండెజబ్బు ఉన్నవారు ప్రాణభయంతో బిక్కుబిక్కుమంటున్నారని అన్నారు. డాంబర్ ప్లాంట్ నుంచి వెలువడే కార్బన్ మోనాక్సైడ్ లాంటి విషపూరిత వాయువుతో అనారోగ్య బారిన పడుతున్నట్లు తెలిపారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి క్వారీలు, క్రషర్లను మూసివేయాలని ఈ సందర్భంగా వినతిలో కోరారు.

యువత మత్తు మాయలో పడొద్దు



బస్టాండ్‌లో పోస్టర్ అంటిస్తున్న పోలీసులు

శాయంపేట : మండలంలోని యువత గంజాయి, మద్యం, గుడుంబాకు బానిసలై జీవితాన్ని నాశనం చేసుకోవద్దని స్థానిక పోలీస్‌లు కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలో శనివారం తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో ముద్రించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాల్లో గంజాయి, గుడుంబా, ఇతర మత్తు పదార్థాల రవాణాను యువత అడ్డుకోవాలని అన్నారు. కల్తీకల్లు, గంజాయి నిర్మూళనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో గురువులతో పూర్వ విద్యార్థులు

కమలాపూర్ : మండల కేంద్రంలోని వివేకవర్ధిని హైస్కూల్‌లో 2010–11 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకొన్నారు. నేరెళ్ల గ్రామ శివారులోని రిసార్ట్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో 13 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకుని తమ చిన్ననాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు హెచ్ఎం పిల్లల రాజు, కరస్పాండెంట్ పబ్బు సతీష్, ఉపాధ్యాయులు పబ్బు అశోక్, మొగిలిచెర్ల ప్రశాంత్, ధర్మల భిక్షపతి, పోతరాజు లింగమూర్తి, చల్లూరి నాగరాజు, పాక అశోక్ తదితరులను ఘనంగా సన్మానించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఉత్సాహంగా గడిపారు. పూర్వ విద్యార్థులు దిలీప్, శ్రీకాంత్, రాజు, శ్రావణ్, మహేష్, దిలీప్, రాజు, రమాకాంత్, ఉమేష్, రంజిత్ పాల్గొన్నారు.

సీఎం సభకు తరలిరావాలి

శాయంపేట : పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 30వ తేదీన రేగొండ మండల కేంద్రంలో నిర్వహించనున్న బహిరంగ సభకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, శ్రేణులు, అధిక సంఖ్యలో తరలిరావాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పిలుపునిచ్చారు. శనివారం గుడెప్పాడ్‌లోని ఎస్ఎస్ఆర్ హోటల్‌లో శాయంపేట మండల కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సభలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి రాహుల్‌గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలుపుతూ ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి ఓట్లు అడగాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల పరిశీలకుడు విజయ్, అధికార ప్రతినిధి అశోక్, ఎంపీటీసీ బాసాని చంద్రప్రకాశ్, పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ చల్లా చక్రపాణి, పరకాల మాజీ ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లక్కీడ్రా ద్వారా విద్యార్థుల ఎంపిక



దామెర : మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలో గల మైనారిటీ గురుకుల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు శనివారం లక్కీడ్రా ద్వారా ఎంపిక చేసినట్లు తెలంగాణ మైనారిటీ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీలత తెలిపారు. నాన్ మైనారిటీ విభాగంలో 45 మంది దరఖాస్తులు చేసుకోగా 10 మందిని ఎంపిక చేసినట్ల పేర్కొన్నారు. అదే విధంగా ఎస్సీ క్యాటగిరీలో 25 మంది విద్యార్థులు దరఖస్తులు చేసుకోగా ఐదుగురిని ఎంపిక చేశామన్నారు. ఎస్టీ క్యాటగిరీలో ఆరుగురికి గాను ముగ్గురిని, ఓసీ క్యాటగిరీలో ఒకరిని ఎంపిక చేసినట్లు ఆమె వెల్లడించారు. మైనారిటీ గురుకులాల విజిలెన్స్ అధికారి ఎస్‌కే. అంజద్, ఉపాధ్యాయులు రహీం, రాజ్‌కుమార్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎంబీ రికార్డు మాయం

దామెర : గ్రామపంచాయతీ ఎంబీ రికార్డు మాయమైన సంఘటన మండలంలోని ల్యాదెళ్లలో వెలుగులోకి వచ్చింది. 804 నంబర్‌గల ఎంబీ రికార్డు గ్రామపంచాయతీ కార్యాలయంలో లేకపోవడంతో పలు అనుమానాలకు తావిస్తుంది. ఎంబీ రికార్డు రెండు సంవత్సరాల క్రితం అప్పటి వార్డు సభ్యుడు గ్రామంలో చేపట్టిన పనులకు సంబంధించి రికార్డులో నమోదు చేసేందుకు తీసుకెళ్లినట్లు తెలిసింది. అనంతరం తిరిగి ఇవ్వలేదని తెలిసింది. గ్రామపంచాయతీ పాలకవర్గం కాలపరిమితి ముగిసి నెలలు గడుస్తున్నా ఎంబీ రికార్డు మాత్రం పంచాయతీ కార్యదర్శికి అందించక పోవడంపై గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఉన్నతాధికారులు దృష్టిసారించి ఎంబీ రికార్డు జీపీకి అప్పగించి విచారణ చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి అన్నపూర్ణని వివరణ కోరగా.. ఎంబీ రికార్డు మాజీ వార్డు సభ్యుడు భరత్ తీసుకెళ్లినట్లు తెలిసిందన్నారు. ఇప్పటికే పలుమార్లు జీపీకి అప్పగించాలని కోరామని తెలిపారు. ఇవ్వని పక్షంలో పోలీసులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

సెల్‌ఫోన్ అప్పగింత

ఐనవోలు : మండలంలోని ఉడుతగూడెం గ్రామానికి చెందిన దాట్ల ప్రవీణ్ ఐనవోలు పరిసర ప్రాంతాల్లో తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పొగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను వెతికి బాధితుడికి అప్పగించినట్లు ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు.

బస్సు యాత్రను విజయవంతం చేయండి



పర్వతగిరి : నేడు హనుమకొండలో మాజీ సీఎం కేసీఆర్ నిర్వహించనున్న బస్సు యాత్ర, రోడ్ షోను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ ఏడుదొడ్ల జితేందర్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వరంగల్ పార్లమెంటు అభ్యర్థి డాక్టర్ సుధీర్‌కుమార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేసీఆర్ నేడు (ఆదివారం) బస్సు యాత్ర, రోడ్డు షోకు రానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, నాయకులు చింతపట్ల మాలతి సోమేశ్వర్‌రావు, మేడిశెట్టి రాములు, ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, మాడుగుల రాజు, బోయినపల్లి యుగంధర్‌రావు, చిన్నపాక శ్రీనివాస్, ఏర్పుల శ్రీనివాస్, కరిమిల్లా దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టాలి



పరకాల : పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు



ఆత్మకూరు : పనులను పరిశీలిస్తున్న నాయకులు

పరకాల: పని విధానంపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తిప్పకొట్టాలని ఏఐటీయూసీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు ధర్మల రాంమూర్తి పిలుపునిచ్చారు. 138వ మేడే సందర్భంగా పరకాల వ్యవసాయ మార్కెట్ యార్డులో మే డే వాల్ పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అనేక పోరాటాలతో సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని రద్దు చేసి కొత్తగా 12 గంటల పని విధానానికి కేంద్రం ప్రభుత్వం చట్టం తీసుకొచ్చి కార్మికుల హక్కులను కాలరాయాలని చూస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. మే డే వేడుకలను కార్మికులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా నాయకుడు రాములు, పరకాల డివిజన్ అధ్యక్షుడు అశోక్, నాయకులు కె.అయిలయ్య, కె.శంకర్, ఆర్.రాజయ్య, కె.యాదగిరి , ఎం.రవి, బి.భద్రయ్య, ఎం.రాజేశ్వరి, ఎస్.ఖాన్, ఆర్.ధర్మ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు రూ.600 చెల్లించాలి

ఆత్మకూరు : ఉపాధిహామీ కూలీలకు రోజుకు రూ.600 కూలీ చెల్లించాలని డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్ డిమాండ్ చేశారు. మండలంలోని అక్కంపేట, నాగయ్యపల్లి గ్రామాల్లో శనివారం ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూలీలకు సకాలంలో డబ్బులు చెల్లించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. కూలీ రోజులు 100 నుంచి 200కు పెంచాలన్నారు. పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేశం, సాంబయ్య, రవి, వీరస్వామి పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులను ప్రశ్నించండి

- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



మాట్లాడుతున్న ధర్మారెడ్డి

ఆత్మకూరు : ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ మరోసారి మోసం చేసేందుకు ప్రజల వద్దకు వస్తుందని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నాయకులను, అభ్యర్థిని హామీల అమలు ఏమైందని ప్రశ్నించాలని ప్రజలకు సూచించారు. మండల కేంద్రంతో పాటు కటాక్షపూర్, హౌజుబుజుర్గు, నీరుకుళ్ల, పెంచికలపేట, చౌళ్లపల్లి, కొత్తగట్టు, మలక్‌పేట, గూడెప్పాడ్, తిరుమలగిరి గ్రామాల్లో శనివారం స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. రైతుబంధు, రూ.4వేల పింఛన్, రుణమాఫీ, మహిళలకు రూ.2500 సాయం, నిరుద్యోగ భృతి వంటి హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అటకెక్కించిందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, చేసిన మోసాన్ని గ్రామాల్లోని ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. వరంగల్ బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి సుధీర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించే దిశగా పనిచేయాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్పాలన్నారు. మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి, నాయకులు కేశవరెడ్డి, కుమారస్వామి, రవియాదవ్, రాజేశ్వర్‌రావు మాజీ సర్పంచ్‌లు యాదగిరి, రబియాబీహుస్సేన్, బలరాం, లలిత, మనోహర్, నరేష్ పాల్గొన్నారు.

ఓటుహక్కును వినియోగించుకోవాలి

- మున్సిపల్ కమిషనర్ కె.నర్సింహ



మెప్మా, ఆర్పీలతో ప్రతిజ్ఞ చేస్తున్న కమిషనర్

పరకాల : పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌లో ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవడంతోపాటు అర్హులందరూ ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలని మున్సిపల్ కమిషనర్ నర్సింహ పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శనివారం స్వీప్ కార్యక్రమంపై మెప్మా, ఆర్పీలతో ఆయన అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని 22 వార్డుల్లో గత ఎన్నికల కంటే మెరుగైన పోలింగ్ శాతం నమోదు అయ్యేలా చూడాలని అన్నారు. అదే విధంగా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు నీడ, మంచినీటి సదుపాయంతో పాటు వృద్ధులు, వికలాంగులు, గర్భిణులకు వీల్‌చైర్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రతిఒక్కరు బాధ్యతాయుతంగా పనిచేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

రాజ్యాంగ పరిరక్షణ సదస్సుకు తరలాలి

- జేఏసీ కన్వీనర్ లక్ష్మారెడ్డి



మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

ఎల్కతుర్తి : రేపు హుస్నాబాద్ పట్టణంలో నిర్వహించతలపెట్టిన భారత రాజ్యాంగ పరిరక్షణ సదస్సును విజయవంతం చేయాలని హుస్నాబాద్ జేఏసీ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్పోరేట్లకు, సంపన్న వర్గాలకు, దోపిడి దారులకు కొమ్ముకాస్తున్న బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగ పరిరక్షణ సదస్సులో వక్తలు ప్రొఫెసర్ యోగేంద్రయాదవ్ స్వరాజ్ అభియాన్, ప్రొఫెసర్ కోదండరామ్, రైతు స్వరాజ్య వేదిక రవి హాజరుకానున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, పలు సంఘాల నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జేఏసీ మండల కోర్డినేటర్ సారయ్య, వీరన్ననాయక్, కాంగ్రెస్ నాయకులు, ఇంద్రసేనారెడ్డి, రాజేశ్వర్‌రావు, రమేశ్, ప్రకాశ్, శ్రీకాంత్, వెంకటేశ్, మహేందర్, అక్తర్ అలీ, నవీన్ పాల్గొన్నారు.

దాహార్తి తీర్చేందుకే చలివేంద్రాల ఏర్పాటు



పరకాల : చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నర్సింహ



వేలేరు : చలివేంద్రంను ప్రారంభిస్తున్న ఎంపీటీసీ

పరకాల : ప్రజల దాహార్తి తీర్చేందుకే చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె. నర్సింహ అన్నారు. శనివారం అంబేడ్కర్ సెంటర్‌లో చలివేంద్రాన్ని ప్రారంభించారు. చలివేంద్రాల ఏర్పాటుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సానిటేషన్ అధికారి జి.వెంకట్‌రెడ్డి, రోహిత్, జవాను మంద మహేశ్, వేణుతో పాటు రాజిపేట పాల్గొన్నారు.

వేలేరు : పీచరలో మాజీ జెడ్పీటీసీ రఘునాయకుల రాజిరెడ్డి, మాధవరెడ్డిల జ్ఞాపకార్థం వారి కుమారులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీటీసీ జల్లారి సంపత్ శనివారం ప్రారంభించారు.